క్లుప్తంగా

నరసింహుని నిజరూప దర్శనం

సీటీఆర్‌ఐ: కోరుకొండ రోడ్డులోని సింహాచల నగర్ వరహా లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో మంగళవారం స్వామివారి నిజరూప దర్శన సేవ జరిగింది. మదుభయ వేదాంతాచార్య పీఠం ట్రస్టు, శ్రీరంగం ఆధ్వర్యాన ఆలయ ధర్మకర్తలు కాలెపు సూర్యసింహాచలం, కాలెపు నాగేశ్వర రావు సారథ్యంలో చందన యాత్ర మహోత్సవా లలో భాగంగా ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ నిజరూప దర్శనం కల్పిం చారు. ఈ నేపథ్యంలో స్వామివారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. క్యూలైన్లు కిక్కిరిసి పోయాయి. ప్రధాన అర్చకుడు అవసరాల శ్రీ కిరణ్ స్వామి తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు జరిపారు. బుధవారం ఉదయం చందన రూపంతో నిత్యరూప దర్శనం, శ్రీవారి చక్రస్నానం జరుగుతాయి.

పాఠశాలల పరిశీలన



ఎన్‌వీఆర్ పాఠశాలను తనిఖీ చేస్తున్న పర్యవేక్షణ బృందం

కంబాలచెరువు: నగరంలోని పలు పాఠశాల లను మంగళవారం పాఠశాలల పర్యవేక్షణ బృందం పరిశీలించింది. ఇందులో భాగంగా స్థానిక డీఎంహెచ్ స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ఎస్.రాజా ప్రశాంత్, సీఆర్పీ జయంతి శాస్త్రి, ఉపాధ్యాయ బృందం కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలను సందర్శించారు. సిమెంటరీ పేట ప్రాథమిక పాఠశాల, పవర్స్ ఎయిడెడ్ ప్రాథ మికోన్నత పాఠశాల, ఎన్‌వీఆర్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించి రికార్డులను పరిశీ లించారు. విద్యార్థుల ప్రగతిని పరిశీలించి సూచనలు చేశారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

కడియం: దుళ్లలోని భూసమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో భక్తబృందం ఆధ్వర్యం లో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగం గా రెండోరోజు మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం సహస్ర దీపాలంకరణ, శేషవాహన సేవ నిర్వహించారు. గ్రామవీధులలో రథోత్సవం కన్నులపండువగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్ మాధవీలత
- కమిషనర్‌తో కలిసి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత, కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో ప్రతిష్ఠాత్మకం గా చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అధికారు లను ఆదేశించారు. కంబాల చెరువు, స్మార్ట్ రోడ్డు పనుల పురోగతిని మంగళవారం మధ్యాహ్నం కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్‌తో కలిసి ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కంబాల చెరువు వై.జంక్షన్ నుంచి లాలాచెరువు వరకు చేపడుతున్న స్మార్ట్ రోడ్డు పనులను పరిశీలించారు. ఆయా పనులు 30 శాతం మేర మాత్రమే పూర్తవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు త్వరితగతిన పూర్తిచేసి అప్పగించాలని ఆదేశించారు. పనుల్లో పురోగతి లేకపోవడంపై అధికారులను ప్రశ్నిం చారు. రాజమహేంద్రవరం అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధుల మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. స్మార్ట్ రోడ్డు పనులు రెండు వైపుల నుంచీ చేపడితే త్వరితగతిన పూర్తవుతాయన్నారు. ఆ దిశగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. పనుల పురోగతి, ఆర్ ఎంసీ ప్రణాళికను కలెక్టర్‌కు కమిషనర్ దినేష్ కుమార్ వివరించారు. ఎస్‌ఈ పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

- రుడా ఛైర్‌పర్సన్ షర్మిలారెడ్డి, కో ఆర్డినేటర్ నాగేశ్వర్
- ఆల్‌ఇన్‌వన్ పుస్తకాల పంపిణీ



ధవళేశ్వరంలో విద్యార్థినులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న చందన నాగేశ్వర్, షర్మిలా రెడ్డి

ధవళేశ్వరం: విద్యార్థులు బాగా చదివి ఉత్తమ ఫలి తాలు సాధించాలని వైఎస్సార్ సీపీ రాజమహేం ద్రవరం రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ సూచించారు. మంగళవారం ధవళేశ్వరం బాలికో న్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు రాజ మహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో ఆల్‌ఇన్‌వన్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి చందన నాగేశ్వర్, రుడా ఛైర్‌పర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి ముఖ్య అతి థులుగా విచ్చేశారు. నాగేశ్వర్ మాట్లాడుతూ త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్షలకు ఉప యోగపడేలా రుడా ఆధ్వర్యంలో ఈ పుస్తకాలు పం పిణీ చేయడం అభినందనీయమన్నారు. ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమాన్ని చేపట్టిన రుడా ఛైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ షబ్బర్ బాషా, హితకారిణి సమా జం డైరెక్టర్ దేవులపల్లి సరితారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు సాధనాల చంద్రశేఖర్ (శివ), తలారి వరప్రసాద్, రేగుళ్ల రాజు, పెన్నాడ లక్ష్మి, పుట్టా పరేష్ నాథ్, చప్పిడి జ్యోతి, మెండా రాజేష్, గూటం రాజు, నంబూరి రవి, శ్రీరంగం బాలరాజు, ఎల్‌వీ ప్రసాద్, బర్రి కామేశ్వరరావు, ముత్యాల జాన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ధవళేశ్వరంలో జరుగుతున్న మెయిన్ రోడ్డు పనులను వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ మంగళవారం పరిశీలించారు. నిత్యం రద్దీగా ఉండే రహదారి మరమ్మతులకు గురికావడంతో కోటిపల్లి బస్టాండ్ నుంచి ధవళే శ్వరం చేపల మార్కెట్ వరకు రోడ్డు నిర్మాణ పనులకు రూ.6 కోట్లు కేటాయించేలా కృషి చేశారు. త్వరలోనే నిర్మాణ పనులు పూర్తవుతాయని చందన నాగేశ్వర్ పేర్కొన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు ,కార్యకర్తలు ఉన్నారు.

కంప్యూటర్, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ

రాజమహేంద్రవరం సిటీ: స్వర్ణాంధ్ర సేవాసంస్థ ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న కంప్యూటర్, బ్యూటీషియన్, మగ్గం, టైలరింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆ సంస్థ నిర్వాహకుడు లయన్ డాక్టర్ గుబ్బల రాం బాబు మంగళవారం తెలిపారు. కంప్యూటర్ కోర్సుకు ఇంటర్, ఇతర కోర్సులకు పదో తరగతి చదివి ఉండాలన్నారు. ఫిబ్రవరి 9 నుంచి 45 రోజుల పాటు శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. శిక్షణలో మెటీరియ ల్‌తో పాటు మధ్యాహ్న భోజనం అందజేస్తా మని, అనంతరం ఉత్తీర్ణత పత్రాలు ప్రదానం చేస్తామన్నారు. కంప్యూటర్ కోర్సులో చేరే వారు 81256 86494, టైలరింగ్ బ్యూటిషన్ కోర్సులకు 95731 11923 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమానికి రావాలని కోరారు.

కాంగ్రెస్ పాదయాత్ర

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): చేయి చేయి కలుపుదాం, రాహుల్ గాంధీకి మద్దతుగా నిలుద్దాం, కాంగ్రెస్‌ను బలపరుద్దాం అనే నినా దాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకుని వెళ్లేందుకు ఆ పార్టీ నగర అధ్యక్షుడు, రాజమహేంద్రవరం రూరల్ నియోజక వర్గ ఇన్‌చార్జి, పీసీసీ సభ్యుడు బాలేపల్లి మురళీధర్ మంగళవారం స్థానిక 17వ డివిజన్ నుంచి పాదయాత్ర ప్రారంభిం చారు. ముందుగా పీసీసీ కార్యదర్శులు బెజవాడ రంగారావు, ముళ్ల మాధవ్, పీసీసీ సభ్యుడు చింతాడ వెంకటేశ్వర రావు, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర నాయకు రాలు ఆకుల భాగ్య సూర్యలక్ష్మి తదిత రులతో ఐఎల్‌టీడీ జంక్షన్‌లోని ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, అంబేడ్కర్, డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. అక్కడి నుం చి ఐఎల్‌టీడీ, బొగ్గుల దిబ్బ, రైతు బజార్ పరిసర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి భారత్ జోడో యాత్రకు సంబంధిం చిన పోస్టర్లను పంపిణీ చేశారు. బాలేప ల్లి మాట్లాడుతూ బీజేపీ పాలనలో ధరలు దారుణంగా పెరిగిపోయా యన్నారు. కిశోర్ కుమార్‌జై, విజయ లక్ష్మి, నలబాటి శ్యామ్ పాల్గొన్నారు.

కేశవభట్ల సేవలు అభినందనీయం



కేశవభట్ల శ్రీనివాసరావుకు ఆత్మీయ వీడ్కోలు పలుకుతున్న తోటి ఉద్యోగులు

రాజమహేంద్రవరం సిటీ: రైల్వే చీఫ్ టికెట్ ఇన్‌స్పె క్టర్ కేశవభట్ల శ్రీనివాసరావు విధి నిర్వహణలో అం దించిన సేవలు అందరికీ ఆదర్శనీయమని పలు వురు కమర్షియల్ విభాగం ఉద్యోగులు కొనియా డారు. రైల్వే శాఖలో 36 ఏళ్ల విధులు నిర్వహించి మంగళవారం రాజమహేంద్రవరం స్టేషన్ చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగ విరమణ చేసిన కేశవ భట్ల శ్రీనివాసరావును తోటి ఉద్యోగులు సత్కరిం చారు. కేక్ కట్ చేయించి, ఆత్మీయ వీడ్కోలు పలి కారు. ఉద్యోగ నిర్వ హణలో కేశవభట్ల చేసిన సేవలు, సమా జంలో చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేదలకు అందించిన సేవా నిరతిని కొనియాడా రు. కేశవభట్ల శ్రీనివా సరావు మాట్లాడుతూ కమర్షియల్ విభాగంలో ఉద్యోగులందరూ ఐక మత్యంతో విధులు నిర్వహించి రాజమహేం ద్రవరం రైల్వే స్టేషన్‌కు మంచిపేరు తీసుకురావాల న్నారు. కార్యక్రమంలో రైల్వే టికెట్ చెకింగ్ అధికా రులు పి.విజయ శ్రీను, ఏఎస్ఆర్ ప్రసాద్, పి.రాజ్ కుమార్, సీహెచ్ రామకృష్ణ, సుంకర చంద్రమౌళి, కునిశెట్టి సతీష్, లంకలపల్లి కిరణ్‌కుమార్, భవానీ శంకర్, ఆకుల కల్యాణ్, తిలక్ కుమార్, ఫణిశంకర్ పాల్గొన్నారు.

జేసీఎస్ కన్వీనర్లుగా ఐదుగురి నియామకం



జేసీఎస్ కన్వీనర్లతో మాట్లాడుతున్న ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ: నియోజకవర్గానికి ఐదుగురు జేసీఎస్ కన్వీనర్లు నియమితుల య్యారని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి మంగళవారం ప్రకటించారు. పార్టీ అధిష్ఠానం సూచనల మేరకు జేసీఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ పుత్తా ప్రతాప్ రెడ్డి ఈ నియా మకాలు చేశారన్నారు. కన్వీనర్లుగా 1, 2, 3, 4, 5, 6, 7, 8, 31, 50 డివిజన్లకు (మొదటి క్లస్టర్) బర్రే కొండబాబు, 9, 10, 11, 12, 13, 14, 15, 29 డివిజన్లకు (రెండో క్లస్టర్) ఎస్. శ్రీనివాస్, 21, 22, 23, 24, 25, 28, 30 డివి జన్లకు (మూడో క్లస్టర్) కొత్త విజయరాజ్యలక్ష్మి, 32, 33, 34, 35, 36, 37, 38, 39, 40 డివిజన్లకు (నాలుగో క్లస్టర్) మజ్జి అప్పారావు, 41, 42, 43, 44, 45, 46, 47, 48, 49 డివిజన్లకు (ఐదో క్లస్టర్) పోలు విజయలక్ష్మి నియమితులయ్యారు. వారిని ఎంపీ మార్గాని భరత్ రామ్ అభినందించారు.



గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలి



పేపర్ మిల్లు ఎదుట దీక్ష చేస్తున్న కార్మికులు

ప్రకాశం నగర్: పేపర్ మిల్లు యాజమాన్యం కార్మికుల గుర్తింపు సంఘం ఎన్నికలు వెంటనే జరపాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.పూర్ణిమ రాజు డిమాండ్ చేశారు. మిల్లు గేటు ఎదుట కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం 21వ రోజుకు చేరాయి. ఈ దీక్షలకు జిల్లా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూని యన్ జిల్లా కార్యదర్శి కె.బేబీరాణి, జిల్లా నాయకులు మాణిక్యాంబ, అన్నపూర్ణ, సుబ్బలక్ష్మి మద్దతు తెలిపారు. పూర్ణిమరాజు మాట్లాడుతూ పేపర్ మిల్లు కార్మికులు దీక్షలు చేస్తుంటే యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. వి.రాంబాబు, ఎం.రామకృష్ణ, విక్రమ్, వై.అప్పారావు, బి.శ్రీనివాస్ దీక్షలో కూర్చున్నారు.

మాదక ద్రవ్యాలతో అనేక అనర్థాలు



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రత్యూష కుమారి

కంబాలచెరువు: నల్సా మాదక ద్రవ్యాల బాధితు లకు న్యాయ సేవలు, నిషేధ పథకంపై మంగళ వారం జిల్లా న్యాయసేవాధికార సంస్థలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి మాట్లా డుతూ పిల్లలు, మహిళలే ఎక్కువగా అక్రమ రవా ణాకు గురవుతున్నారన్నారు. ట్రాన్స్‌జెండర్లు వారి హక్కులను తెలుసుకుని, ఎవ్వరికీ భయప డకుండా, స్వాభిమానంతో జీవించాలన్నారు. మాదక ద్రవ్యాల ఉత్పత్తి, సరఫరా, వాడకం, క్రయ విక్రయాలు చట్టరీత్యా నేరమన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఫ్లాపస్ చైర్మన్ ఏ.గా యత్రీదేవి మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధి కార సంస్థ అందిస్తున్న న్యాయ సేవలను అం దరూ వినియోగించుకోవాలన్నారు. అనంతరం తొమ్మిది మంది ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో రాజమ హేంద్రవరం ఏఎస్పీ పాపారావు, కోనసీమ ఏఎస్పీ లతామాధురి పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారానికే గడపగడపకూ

- వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- మురమండలో పర్యటన



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న చందన నాగేశ్వర్

కడియం: ఏమ్మా! బాగున్నావా, వలంటీర్లు మీ ఇంటికి వస్తు న్నారా, ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అంటూ వైఎ స్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ప్రజలను పలకరించారు. మురమండ గ్రామ సచివాలయం–1 పరిధిలో మంగళవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్య క్రమం నిర్వహించారు. చందన పార్టీ నాయకులు, సచివా లయ ఉద్యోగులు, వలంటీర్లతో కలిసి గ్రామంలో కుటుం బాలను కలిసి మాట్లాడారు. మూడున్నరేళ్లలో చేపట్టిన సం క్షేమ పథకాల బుక్‌లెట్లను పంపిణీ చేశారు. సమస్యలను తెలు సుకుని పరిష్కరించడానికే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గడపగడ పకూ మన ప్రభుత్వం కార్యక్రమం రూపొందించారన్నారు. తన దృష్టికి వచ్చిన పలు సమస్యలను త్వరితగతిన పరిష్కరిం చనున్నట్టు తెలిపారు. అయినవిల్లి వెంకటేశ్వరరావు, చేనేత సొసైటీ చైర్మన్ యర్రా సూర్యనారాయణ, సొసైటీ చైర్‌పర్సన్ ఈదర దీన దయాల్, మాజీ సొసైటీ అధ్యక్షుడు గారపాటి బుజ్జిబాబు, మెల్లిమి గంగరాజు, శాప్ డైరెక్టర్ బీమిరెడ్డి నాగేం ద్ర, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్, ఈలి గోపా లం, ఎంపీటీసీ ఆకుల సుధాకర్, మాజీ సర్పంచ్ సాపిరెడ్డి సూరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

3న రాజ్యాధికార చైతన్యయాత్ర



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

కడియం: బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 3న జరిగే బహుజన రాజ్యాధికార చైతన్యయాత్రను విజయవం తం చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయ కుమార్, జిల్లా ఇన్‌చార్జి, ప్రముఖ న్యాయవాది పరమట గణేశ్వరరావు పిలుపునిచ్చారు. కడియం అంబేడ్కర్ సెంట ర్‌లో మంగళవారం పార్టీ మండల అధ్యక్షుడు దమ్ము కృష్ణం రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చైతన్యయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. పరమట గణేశ్వరరావు మాట్లా డుతూ 3వ తేదీన ధవళేశ్వరం నుంచి వేమగిరి, బుర్రిలంక, కడియపులంక, పొట్టిలంక, వీరవరం మీదుగా చైతన్య యాత్ర సాగుతుందన్నారు. కడియంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రసంగం ఉంటుందన్నారు. బీఎస్పీ రూరల్ అధ్యక్షుడు గెడ్డం ప్రసాద్, రూరల్ ఇన్‌చార్జి పల్లి అబ్బులు, దోనపాటి వందనం, కనికెళ్ల బుల్లియ్య పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కంబాలచెరువు: మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య చేసు కున్న సంఘటన ప్రకాశం నగర్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. కాంచన్ నగర్‌కు చెందిన రాజశేఖర్ (47)కి పెళ్లి కాలేదు. అతడు మద్యం తాగి, జులాయిగా తిరుగుతుంటాడు. ఈ నేపథ్యంలో ఇంటిలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

















